క్లుప్తంగా

చాట్రాయిలో ప్రజా దర్బార్



చాట్రాయి: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ప్రశాంతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ వివిధ సమస్యలపై 66 అర్జీలు వచ్చాయని, వీటిలో 37 అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించినవన్నారు. అర్జీలను ఆయా శాఖలకు పంపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంఈఓ బ్రహ్మచారి, వ్యవసాయాధికారి బి. శివశంకర్, టీడీపీ మండల అధ్యక్షురాలు బొట్టు విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం: సెప్టెంబర్‌లో వచ్చిన వరద ప్రభావిత ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఫెర్రీలోని భవిత కేంద్రం, కొటికలపూడి ఎంపీయూపీ పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు రెండు దుప్పట్లు, రైటింగ్ ప్యాడ్, పెన్నులతో కూడిన కిట్లను ఎంఈఓ సీహెచ్ పుష్పలత చేతుల మీదుగా అందజేశారు.

'సారథి.. మన వారధి'కి 531 అర్జీలు

నూజివీడు: రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాల మేరకు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సారథి మన వారధి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 531 అర్జీలు వచ్చాయని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 218 అర్జీలు, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 183, గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 108, ఉపాధి హామీ పథకానికి సంబంధించి 11, ఏపీ ట్రాన్స్‌కోకు సంబంధించి 4, పశు సంవర్ధక శాఖకు సంబంధించి 3, ఇరిగేషన్ శాఖకు సంబంధించి 3, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి ఒక అర్జీ అందాయని చెప్పారు. ఈనెల 4న ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 230 అర్జీలు

ఆగిరిపల్లి: స్థానిక పొన్నం కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి 230 అర్జీలు వచ్చాయని ఏఓ అబ్దుల్ సలాం తెలిపారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ భార్గవి ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఏపీఎం రాజశేఖర్, ఈఓపీఆర్డీ ఆనంద బాబు, రాగమయి పాల్గొన్నారు.

● **ముసునూరు:** మండల స్థాయిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 138 అర్జీలు అందాయని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 106 అర్జీలు, ఇతర సమస్యలపై 32 అర్జీలు అందాయన్నారు.

అవకతవకలు సరిచేయాలి

తిరువూరు: నీటి సంఘం ఎన్నికల ఓటర్ల జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని, అవకతవకలను సరిచేసిన తర్వాతే ఎన్నికలు జరపాలని తిరువూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. త్వరలో జరుగనున్న నీటి సంఘం ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో ఒకే రైతు పేరు పలు ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఉండటంతో పాటు ఒకే జాబితాలో 2, 3 సార్లు పునరావృతమైందని, పరిశీలన లేకుండా హడావుడిగా రూపొందించిన ఈ జాబితాలను పునఃపరిశీలించాలని పార్టీ నాయకులు తాళ్లూరి నవీన్, పసుపులేటి శేఖర్, మోదుగు ప్రసాద్, దుర్గారావు తదితరులు కోరారు. ఓటర్ల జాబితాలను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

లయన్స్ క్లబ్ సేవలు మరువలేనివి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వీఆర్కే నగర మహిళ లయన్స్ క్లబ్ సభ్యుల సామాజిక సేవలు మరువలేనివని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి అన్నారు. గవర్నర్ల వార్షిక తనిఖీలో భాగంగా కొండపల్లిలో మంగళవారం పర్యటించి లయన్స్ క్లబ్ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. మహిళా క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న అన్నదానం, కంటి ఆపరేషన్లు, నిత్యావసర సరుకుల పంపిణీ, వివిధ రకాల శిక్షణా తరగతులు, వరద బాధితులకు చేసిన సేవలను పరిశీలించి అభినందించారు. లయన్ దేవినేని రీనారాయ్, దేవినేని ప్రత్యూష, నాగార్జున కుటుంబ సభ్యులు 100 మంది వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వీఆర్కే నగర మహిళ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు గుంటుపల్లి రాజేశ్వరి ఆధ్వర్యంలో గవర్నర్ శేషగిరి దంపతులను సభ్యులు సన్మానించారు.

ఖరీఫ్ ముగుస్తున్నా.. అందని సాయం

నూజివీడు నియోజకవర్గంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్ దాదాపు చివరి దశకు చేరింది. 60 శాతానికి పైగా కోతలు పూర్తయినా అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఎలాంటి భరోసా కల్పించలేదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.2 వేలు చొప్పున రెండు విడతల్లో పెట్టుబడి సాయాన్ని విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులకు చేస్తామన్న సాయం ఊసే ఎత్తడం లేదు.



నూజివీడులో వరి కోత కోస్తున్న కూలీలు

- ఊసేలేని అన్నదాత సుఖీభవ
- పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు
- పీఎం కిసాన్ నిధులు విడుదలైనా నోరుమెదపని రాష్ట్ర ప్రభుత్వం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మే నెలలోనే పెట్టుబడి సాయం జమ
- గత ప్రభుత్వంలో ఐదేళ్లలో నియోజకవర్గంలో రూ.195 కోట్లు అందజేత

నూజివీడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా స్థానంలో అన్నదాత.. సుఖీభవ పేరిట ఏడాదికి రూ.20 వేలు సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో ఆశ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. గద్దెనెక్కాక అన్నదాతలను నిండా ముంచేశారు. చంద్రబాబు బాధ్యతలు చేపట్టి ఐదు నెలలు గడిచినప్పటికీ అన్నదాత సుఖీభవ పథకంపై ఇంత వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ముందుగానే ఇస్తానన్న పెట్టుబడి సాయం కోసం నూజివీడు నియోజకవర్గంలో 41,349 మంది రైతులు ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గం పరిధిలో 22 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు. ఒక్కొక్కరికీ రూ.20 వేల చొప్పున మొత్తం రూ.82.70 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. వీటి కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో నియోజకవర్గంలోని రైతులకు రూ.195 కోట్లను పెట్టుబడి సాయం కింద అందజేసింది.

పీఎం కిసాన్ నిధుల జమ..

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం జూన్ 18న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద తొలి విడతలో రూ.2 వేల చొప్పున రూ.8.27 కోట్లు విడుదల చేసింది. దీంతో నియోజకవర్గంలోని 41,349 మంది రైతులు లబ్ధి పొందారు. అక్టోబర్ 5న రెండో విడత కిసాన్ సాయంగా మళ్లీ ఒక్కొక్క రైతుకు రూ.2 వేల చొప్పున విడుదల చేసింది. రెండు విడతల్లో కలిపి రూ.16.54 కోట్లు ఆర్థిక సాయం అందించింది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా.

గడచిన ఐదేళ్లూ తొలకరి సీజన్‌కు పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కిసాన్ సమ్మాన్ నిధి, రైతు భరోసా పథకాల ద్వారా సాయాన్ని ఒకేసారి రైతులకు అందజేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కలిపి ఏటా మూడు విడతల్లో రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసేవారు. ఇందులో తొలి విడతలో అంటే మే నెలలోనే రూ.7,500 రైతుల ఖాతాలకు జమ చేసేవారు. దీంతో రైతులు వాటిని పంటల సాగుకు సద్వినియోగం చేసుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రైతులకు అందజేస్తామని హామీ ఇచ్చిన రూ.20 వేలు విడుదల చేయకుండా దీనిపై ఎటువంటి ప్రకటన చేయకుండా మౌనంగా ఉండటం దారుణమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు



కూటమి నాయకులు ఎన్నికల ముందు అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడిచినా ఇంత వరకు రైతులకు ఎటువంటి సాయం అందించలేదు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతల్లో రూ.4 వేలు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే విడుదల చేయాలి.

– పాలడుగు విజయ్‌కుమార్, తుక్కులూరు

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంలో రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని తక్షణమే విడుదల చేయాలి. ఖరీఫ్ సీజన్ ముగుస్తుండగా, మరో వైపు రబీ సీజన్‌లో రైతులు మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలను సైతం సాగు చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతులను ఆదుకోవాలన్న ఆలోచన ఉన్నట్లు కనిపించడం లేదు.

– నిమ్మగడ్డ నరసింహా, రైతుసంఘం నేత, గొల్లపల్లి

వినియోగదారులపై భారం మోపవద్దు

తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ కస్తూరిబాయి



మాట్లాడుతున్న గత్తం కస్తూరిబాయి, నాయకులు

తిరువూరు: విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్ చార్జీల పేరుతో అదనపు బాదుడుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం గర్హనీయమని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇంధన చార్జీలు, సర్దుబాటు చార్జీలు, అదనపు చార్జీల పేరుతో వినియోగదారుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్న తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ ఎస్టీలకు గతంలో ఇచ్చిన ఉచిత కరెంటుకు కూడా బిల్లులు జారీ చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజలపై అదనపు భారం మోపేందుకు సిద్ధమవుతోందని, నాటి వైఎస్సార్ సీపీ పాలనపై ప్రతి రోజూ బురద జల్లడానికే సమయం కేటాయిస్తోందని విమర్శించారు. ప్రతిపక్ష నేతలపై, క్యాడర్‌పై అక్రమ కేసులు బనాయించి, అక్రమంగా అరెస్టు చేయడంతో ప్రజాస్వామ్య విలువలు కాలరాస్తున్నారని, ఇటువంటి ప్రయత్నాలెన్ని చేసినా ప్రజల అసంతృప్తిని అణచివేయలేరని చెప్పారు. పార్టీ నాయకులు గజ్జల సీతారామారావు, వెలుగోటి ఆదినారాయణ, మూడు దుర్గారావు, గత్తం నాగేశ్వరరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

తిరువూరు: తమ వార్డులో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని తిరువూరు ఒకటో వార్డు ప్రజలు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. మన వూరు–తిరువూరు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు స్థానికులు పలు సమస్యలు విన్నవించారు. కొత్త కాలనీ, రాజుపేట ఎస్సీ కాలనీలలో మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతర్గత రహదారులు నిర్మించాలని, ప్రతి రోజూ రక్షిత మంచినీరందించాలని ఎమ్మెల్యేని వారు కోరారు.

● **గాదెవారిగూడెం(గంపలగూడెం):** పశు పోషకులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో అందజేస్తున్న గోకుల షెడ్ (పశువుల కొట్టం)ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. గాదెవారిగూడెంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రైతు గాదె బాబురావుకు రూ. 2.30 లక్షలతో మంజూరైన గోకుల షెడ్డును ఆయన, సర్పంచ్ శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన బుక్‌కీపర్లు

విస్సన్నపేట: మండలంలోని పలువురు బుక్‌కీపర్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీశను మంగళవారం కలిశారు. వెలుగు కార్యాలయంలో జరిగిన అవినీతిపై గత నెల 18న ఫిర్యాదు అందగా డీఆర్డీఏ జిల్లా అధికారులు గత నెల 20 తేదీన విచారణ చేశారు. ఈ నేపథ్యంలో కొందరు బుక్‌కీపర్లను తొలగించారు. కాగా తొలగించబడిన బుక్‌కీపర్లు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమను అక్రమంగా తొలగించారని ఆవేదన వ్యక్తంచేశారు. సంబంధిత ఆధారాలను కలెక్టర్‌కు అందజేసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.



జిల్లా కలెక్టర్ లక్ష్మీశను కలిసిన బుక్‌కీపర్లు

వివాదాలకు తావు లేకుండా ఎన్నికలు: ఆర్డీఓ



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఆర్డీఓ మాధురి

తిరువూరు: సాగునీటి వినియోగదారుల సంఘాలకు త్వరలో జరుగనున్న ఎన్నికల్లో ఎటువంటి వివాదాలకు తావులేకుండా సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. మాధురి అన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బందికి మంగళవారం తిరువూరులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గంపలగూడెం మండలంలో ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో ఆర్డీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల కనుగుణంగా మాత్రమే ఎన్నికల ప్రక్రియ జరగాలన్నారు. ఇంజినీరింగ్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

● **విస్సన్నపేట:** త్వరలో జరుగనున్న నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలకు సంబంధించి ఎన్నికల అధికారులకు, పోలింగ్ అధికారులకు స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, తదితర అంశాలను ఎంపీడీఓ సీహెచ్ చిన్నరాట్నాలు వివరించారు. తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోలుపడిలో పొలం పిలుస్తోంది

రోలుపడి(తిరువూరురూరల్): రబీ పంటలు సాగు చేసే రైతులు వాటి వివరాలను తమ వద్ద నమోదు చేయించుకోవాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ కోరారు. మండలంలోని రోలుపడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి పసల్ బీమా యోజనలో లబ్ధి పొందదలచిన రైతులు తాము వేయదలచిన పంటల వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. వరి, మొక్కజొన్న పంటలకు ఎకరాకు రూ.126 చొప్పున ప్రీమియం చెల్లించాలని, వరి పంట నమోదుకు డిసెంబరు 31, మొక్కజొన్న పంట నమోదుకు డిసెంబరు 15 చివరి తేదీగా నిర్ణయించారని చెప్పారు.

● **మైలవరం:** వరి ధాన్యాన్ని వీలైనంత త్వరగా మిల్లులకు తరలించాలని పీఏసీఎస్ సిబ్బందికి మైలవరం ఏడీఓ ఎం.శ్రీనివాసరావు సూచించారు. మైలవరం మండలం గణపవరం ఆర్ఎస్‌కే పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాలు, కోత కోసిన వరి ధాన్యాన్ని మంగళవారం ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి కోసిన రైతులు మైలవరం మార్కెట్ యార్డులో ఏడీఏ శ్రీనివాసరావును సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో మైలవరం ఏఓ సంధ్యారాణి, వీఏఏలు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

మైలవరం: శారీరక లోపాలు ఉన్నప్పటికీ దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందున్నారని మైలవరం సివిల్ కోర్టు జడ్జి ఎం. శైలజ అన్నారు. మైలవరంలోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ ఆధ్వర్యంలో స్థానిక భవిత సెంటర్‌లో దివ్యాంగుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జడ్జి శైలజ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా భవిత సెంటర్‌లో దివ్యాంగులకు ఆటపాటలు నిర్వహించారు. దాతల సహకారంతో భోజనం ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



మైలవరంలో దివ్యాంగులకు బహుమతులు అంజేస్తున్న జడ్జి శైలజ



ఆగిరిపల్లిలో విజేతకు బహుమతి అందజేస్తున్న ఎంఈఓ

● **చాట్రాయి:** దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎంఈఓ బ్రహ్మాచారి అన్నారు. మంగళవారం చాట్రాయి భవిత కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన పాల్గొని చిన్నారులకు బహుమతులు అందజేశారు. కొండపర్వ బెతెస్తా చర్చి, తలపంటి రాజశేఖర్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు భోజనం, వీసం నరసింహారావు ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు.

● **గంపలగూడెం:** ప్రత్యేక అవసరాల(దివ్యాంగులు) పిల్లలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బొల్లె పోగు కిరణ్ అన్నారు. గంపలగూడెం స్పెషల్ ఎలిమెంటరీ పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగులకు ప్రోత్సాహకాలను అందజేశారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పి. విజయ బాబు, ఫిజియో థెరపిస్ట్ వెంకన్ననాయుడు, సిబ్బంది జి. కృష్ణ, టి. ప్రసాద్ పాల్గొన్నారు.

● **ఆగిరిపల్లి:** దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక భవిత కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు ఎంఈఓ సర్వేశ్వరరావు బహుమతులు అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ వైకల్యం శరీరానికే కానీ మనసుకు కాదన్నారు. దివ్యాంగులు చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎంఈఓ–2 కొవ్వలి ఆనంద్ కుమార్, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పుష్పలత, ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **విస్సన్నపేట:** పిల్లలు దివ్యాంగులుగా ఉన్నారని తల్లిదండ్రులు బాధపడకుండా వారిలో ఉన్న నైపుణ్యాన్ని తెలుసుకొని ప్రోత్సహించాలని ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వరలక్ష్మి అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్ స్కూల్ ఆవరణలోని భవిత కేంద్రం వద్ద అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

● **ముసునూరు:** ముసునూరు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అధ్యక్షతన దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ డాక్టర్ వరికూటి ప్రతాప్ మాట్లాడారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

● **సమస్యలపై ఉపాధ్యాయుల ఆందోళన**

మైలవరం: జి.కొండూరు మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ ఆధ్వర్యంలో జి. కొండూరులో ఉపాధ్యాయులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలంలో ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్‌లలో సుదీర్ఘ కాలంగా ఎంట్రీలు లేవన్నారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయుల బదిలీలు జరుగనున్నాయని చెప్పారు. వెంటనే సర్వీస్ రిజిస్టర్‌లు అప్డేట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. అనుగ్రహ ప్రసాద్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బి.అనిల్‌కుమార్, వై. మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

● **వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలని వినతి**

ఇబ్రహీంపట్నం: కోర్టు ఉత్తర్వుల మేరకు వీఓఏలను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విజయవాడ సెర్ప్ సీఈఓ వీరపాండియన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా జిల్లాలోని జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం నియోజకవర్గం పరిధిలో సుమారు 150 మందిని విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

● **సీలింగ్ ఫ్యాన్ల వితరణ**

తిరువూరు: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహానికి భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ 11 సీలింగ్ ఫ్యాన్లను మంగళవారం వితరణ ఇచ్చింది. వసతి గృహ సంక్షేమాధికారి సంపూర్ణకు ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ విజయశేఖర్ ఈ ఫ్యాన్లను అందజేశారు. తిరువూరు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రవికుమార్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

● **ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ర్యాలీ**

నూజివీడు: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి. శివకుమార్ డిమాండ్ చేశారు. నూజివీడులో మంగళవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటును కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● **ట్రిపుల్ ఐటీలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఏర్పాటు**

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం మంగళవారం ఏర్పాటు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా కె. శివలాల్, ఉపాధ్యక్షుడిగా పి. సూర్యచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా బి. జ్యోతీలాల్ నాయక్, కోశాధికారిగా డి. నాగార్జునదేవి, సభ్యులుగా పి. శ్యాం, ఎస్. చిరంజీవి, సురేష్ ఎన్నికయ్యారు. అనంతరం ఆర్జీయూకేటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్‌ను కలిసి యూనియన్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు.

● **సమస్యలు పరిష్కరించాలి**

నూజివీడు: పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు మంగళవారం వార్డు సచివాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని, డ్రెయినేజీలు లేక మురుగునీరు నిల్వ ఉండి ఇబ్బందులు పడుతున్నామని, ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చిమొక్కల్లో పాములు సంచరిస్తున్నాయని, చిల్డ్రన్ పార్కును అభివృద్ధి చేయాలని కోరారు.

● **నైపుణ్యాభివృద్ధి సదస్సులు ఉపయోగకరం**

ఆగిరిపల్లి: నైపుణ్యాభివృద్ధి సదస్సులు అధ్యాపకులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ ఆర్. వెంకట్రావు అన్నారు. పోతవరప్పాడులోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐసీటీఈ అటల్ ప్రాయోజిత నైపుణ్యాభివృద్ధి సదస్సును చైర్మన్ వెంకట్రావు ప్రారంభించారు. కాకినాడ జేఎన్‌టీయూ హెచ్‌ఓడీ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలక్ట్రిక్ వాహనాల్లో ఉపయోగించే విధానాన్ని అధ్యాపకులకు వివరించారు. ప్రిన్సిపాల్ నాగభాస్కర్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ సాంబశివరావు, కో–ఆర్డినేటర్ కైలాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

● **అధ్యాపకులకు శిక్షణ**

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు యాంఫీసాఫ్ట్ వారిచే శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా మూడో సంవత్సరం విద్యార్థులకు వివిధ సంస్థల ఉద్యోగావకాశాలు పెంపొందించుకోవచ్చన్నారు. కార్యక్రమం మంగళవారం నుంచి 14వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు.

● **లారీ డ్రైవర్‌కు జైలు**

నూజివీడు: లారీని వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి వ్యక్తి మృతికి కారణమైన ఏలూరుకు చెందిన లారీ డ్రైవర్ గల్లా గంగవర ప్రసాద్‌కు మూడు నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. 2009 జూన్ 20న కంకిపాడు మండలం దావులూరుకు చెందిన మసిముక్కు రోశమ్మ తన మనవరాలిని స్కూల్లో చేర్పించి తిరువూరు రోడ్డులోని బస్ స్టాప్ వద్దకు వస్తుండగా నూజివీడు పెద్ద గాంధీబొమ్మ సెంటర్‌లో డ్రైవర్ లారీని నిర్లక్ష్యంగా నడిపి రోశమ్మను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆమె మృతి చెందింది. పట్టణ పోలీసులు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం స్పెషల్ మెజిస్ట్రేట్ డ్రైవర్‌కు మూడు నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

● **చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా**

నూజివీడు: బాకీ తీర్చేందుకు ఇచ్చిన చెక్కు బ్యాంకులో చెల్లని నేరానికి పెద్దపాడు మండలం అంతేకాన్ చెరువు గ్రామానికి చెందిన సత్తి ఆదాంకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.4 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. నూజివీడు మండలం దిగవల్లికి చెందిన బర్రే శ్రీనివాసరావు 2015 నవంబరులో ఆదాంకు రూ.5 లక్షలను అప్పుగా ఇచ్చాడు. కొంతకాలం తరువాత బాకీ చెల్లించమని శ్రీనివాసరావు కోరగా ఆదాం రూ.3 లక్షలకు చెక్కు ఇచ్చాడు. ఆ చెక్కును బ్యాంకులో వేయగా ఆదాం అకౌంట్‌లో నగదు లేదని తిరిగివచ్చింది. దీనిపై శ్రీనివాసరావు కోర్టులో కేసు వేయగా విచారణ అనంతరం ఆదాంకు స్పెషల్ మేజిస్ట్రేట్ జైలు శిక్ష, జరిమానా విధించారు.

● **వైభవంగా రుక్మిణీ కృష్ణ కల్యాణం**

తిరువూరు: స్థానిక కోదండ రామాలయంలో గత నెల 26న ప్రారంభమైన భాగవత సప్తాహ కార్యక్రమ ముగింపు సందర్భంగా మంగళవారం రుక్మిణీ కృష్ణ కల్యాణం నిర్వహించారు. త్రిదండి అహోబిల రామానుజ జియర్ స్వామి ఆధ్వర్యంలో అర్చకులు రుక్మిణీ కృష్ణ కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వైష్ణవ గోష్ఠి, కోదండ రామాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● **కల్యాణ మండపం నిర్మాణానికి రూ.లక్ష విరాళం**

మెట్టగుట్ట(గంపలగూడెం): పెనుగొలను సమీపంలోని మెట్టగుట్టపై శేషాచల శ్రీనివాసుని ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి మంగళవారం ఓ భక్తుడు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. తెలంగాణ రాష్ట్రం మధిర మండలం సిద్ధినేనిగూడెం(మర్లపాడు)కు చెందిన గుర్రాల వెంకటేశ్వరరెడ్డి, భారతి దంపతుల కుమారుడు గుర్రాల రామ కృష్ణారెడ్డి, సీతారామిరెడ్డి ఈ మొత్తాన్ని ఆలయ చైర్మన్ పంది వెంకట్రావుకు అందజేశారు. దాత కుటుంబీకులను అర్చకుడు శ్యాం సుందర శ్రీనివాసాచార్యులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

సవరణ

ది. 24-11-2024 సాక్షి దినపత్రిక తిరువూరు డివిజన్ పేజీలో M/s. Shriram Finance Ltd., తిరువూరు బ్రాంచి (N.T.R జిల్లా, జి.కొండూరు మండలం మరియు గ్రామమునకు చెందిన వారి) ప్రకటనలో పిట్టల వెంకటేశ్వరరావు S/o. సత్యనారాయణ బదులుగా పిట్టల వెంకటేశ్వరరావు W/o సత్యనారాయణగా ప్రచురణ అయినది కావున పై విధముగా సవరించబడినది. డాక్యుమెంట్ నెం. 7155/2023

తిరువూరు, ది. 03/12/2024. — చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్, తిరువూరు, సెల్. 9440764148

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com